# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం | 3 జూలై 2025 | పేజీలు 8


# టెన్త్ చదివిన ప్రతి స్టూడెంట్ ఇంటర్ చదవాల్సిందే





హైదరాబాద్ పెన్ పవర్:: పదవ తరగతి పాస్ అయిన ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 10వ తరగతిలో పెద్ద సంఖ్యలో ఉత్తీర్ణత కనిపిస్తున్నప్పటికీ ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ఆ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడానికి గల కారణాలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బుధవారం (జూలై 2) ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (%×జజజ%)లో విద్యా శాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనందున, ఆ దశలో విద్యార్థికి సరైన మార్గదర్శకత్వం అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాల్లో 9 వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అమలు చేస్తున్నారని, అందువల్ల అక్కడ డ్రాపౌట్స్ సంఖ్య తక్కువగా ఉందని అధికారులు వివరించారు. అలాంటి రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే ఎన్జీవోలు, పౌర సమాజం సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్యను పటిష్టపరచడానికి శాసనసభలోనూ చర్చకు పెడతామని, ఇంటర్‌లో విద్యార్థుల చేరికతో పాటు వారి హాజరుపైనా దృష్టిపెట్టాలన్నారు.

-2 లో

## గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



హైదరాబాద్ పెన్ పవర్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో ఈ నెల 4న ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు,

-2 లో

## మంత్రి సురేఖ ఎన్నికల ఖర్చుపై ఈసీకి బీజేపీ నేత ఫిర్యాదు



- మంత్రి కొండా సురేఖపై కేంద్ర ఎన్నికల సంఘానికి మరో ఫిర్యాదు
- ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని బీజేపీ నేత ప్రదీప్ రావు ఆరోపణ
- రూ.70 కోట్లు ఖర్చు చేశామన్న కొండా మురళి వ్యాఖ్యలే ఫిర్యాదుకు ఆధారం
- ఇప్పటికే ఈ విషయంపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఎన్నికల వ్యయం విషయంలో కొత్త చిక్కుల్లో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా భారీగా ఖర్చు చేసి, ఎన్నికల సంఘానికి తప్పుడు అఫిడవిట్ సమర్పించారని ఆరోపిసూ

-2 లో

## పాశమైలారం పేలుడు ఘటన: ప్రభుత్వం కీలక నిర్ణయం

- సంగారెడ్డి జిల్లా పాశమైలారం పేలుడుపై ప్రభుత్వ విచారణ
- సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త నేతృత్వంలో నలుగురు సభ్యుల కమిటీ ఏర్పాటు
- ప్రమాద కారణాలు, భద్రతా వైఫల్యాలపై దర్యాప్తునకు ఆదేశాలు
- నెల రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్న కమిటీ
- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చర్యలపై సూచనలు కోరిన ప్రభుత్వం



హైదరాబాద్ పెన్ పవర్:సంగారెడ్డి జిల్లా పాశమైలారం లోని రసాయన కర్మాగారంలో సంభవించిన భారీ పేలుడు ఘటనపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఈ ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించేందుకు నలుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ నెల రోజుల్లో ప్రభుత్వానికి తన నివేదికను సమర్పించనుంది.సీఎస్ఐఆర్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త బి. వెంకటేశ్వరరావు ఈ కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు.

-2 లో

## బనకచర్లపై చర్చకు ఎక్కడైనా సిద్ధం

- గాంధీభవన్‌లో వినతుల స్వీకరణ వినతులు
- స్వీకరిస్తున్న మంత్రి శ్రీహరి



హైదరాబాద్ పెన్ పవర్:: బనకచర్ల ప్రాజెక్టుపై చర్చకు ఎక్కడైనా సిద్ధమని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. బనకచర్ల విషయంలో తప్పంతా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నట్లు భారాస నేత హరీశ్‌రావు చేస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి'లో మంత్రి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 90 అర్జీలు వచ్చాయి. అనంతరం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "అప్పటి ఏపీ సీఎం జగన్‌తో కలిసి.. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని కేసీఆర్ చెప్పలేదా?

## మంత్రి సురేఖ ఎన్నికల ఖర్చుపై ఈసీకి బీజేపీ నేత ఫిర్యాదు

- మొదటి పేజీ తరువాయి

బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) ఫిర్యాదు చేశారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి చేసిన వ్యాఖ్యలే ఈ ఫిర్యాదుకు ప్రధాన కారణంగా నిలిచాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం తాము సుమారు 70 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, ఇందుకోసం తమకున్న 500 ఎకరాల భూమిలో 16 ఎకరాలు అమ్మవలసి వచ్చిందని ఆయన బహిరంగంగా పేర్కొన్నారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఉన్నత వర్గాలతోనే పోటీపడ్డానని, తనకు ఎవరూ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఎన్నికల వ్యయ పరిమితిని మించి ఉన్నాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

కొండా మురళి చేసిన ఈ వ్యాఖ్యలను ఆధారంగా చూపుతూ, ప్రదీప్ రావు తన ఫిర్యాదును ఈసీ దృష్టికి తీసుకెళ్లారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కొండా సురేఖపై బీజేపీ అభ్యర్థిగా ప్రదీప్ రావు పోటీ చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఖర్చుకు, వాస్తవ ఖర్చుకు పొంతన లేదని ఆయన తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం ఇది మొదటిసారి కాదు. గతంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కూడా ఇదే అంశంపై ఈసీని ఆశ్రయించారు. ఇప్పుడు బీజేపీ నుంచి కూడా ఫిర్యాదు అందడంతో కొండా సురేఖపై ఒత్తిడి పెరుగుతోంది.

## టెన్త్ చదివిన ప్రతి స్టూడెంట్ ఇంటర్ చదవాల్సిందే

- మొదటి పేజీ తరువాయి

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నమూనాలను ఈ సందర్భంగా సీఎం పరిశీలించారు. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండా ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలల నిర్మాణం ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో బాలురకు ఒకటి, బాలికలకు ఒకటి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయినందున, రెండవ పాఠశాలకు సంబంధించిన స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నిర్మాణ నమూనాను పరిశీలించిన సీఎం రేవంత్.. పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

## గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

- మొదటి పేజీ తరువాయి

కార్పొరేషన్ల ఛైర్మన్లు, పార్టీ ముఖ్య నేతలు తదితరులు హాజరవుతారని బుధవారం ఆయనొక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఖర్గే దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 500 మందిని సమ్మేళనానికి తరలించేందుకు నాయకులు కృషి చేయాలని పొన్నం కోరారు.

సమ్మేళనం కోసం కంట్రోల్ రూం: మహేశ్‌కుమార్‌గౌడ్

ఎల్బీ స్టేడియంలో ఈ నెల 4న జరగనున్న 'గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనం' కోసం పీసీసీ ఆఫీస్ బేరర్లతో గాంధీభవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, నిర్వాహకులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను సమన్వయం చేస్తూ సమ్మేళనాన్ని విజయవంతం చేయడానికి ఈ కంట్రోల్ రూం పని చేస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మేళనానికి సంబంధించి వివరాల కోసం పీసీసీ ఉపాధ్యక్షులు కైలాశ్ కుమార్(9494227444), సురేశ్‌కుమార్(9849013524), అఫ్జర్ యూసుఫ్ జాహి(939 1158997), జగదీశ్వర్‌రావు(9000279999), ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్(9885298353)లను సంప్రదించాలని సూచించారు.

# పాశమైలారం పేలుడు ఘటన: ప్రభుత్వం కీలక నిర్ణయం

- మొదటి పేజీ తరువాయి

కమిటీలో సభ్యులుగా చీఫ్ సైంటిస్ట్ టి. ప్రతాప్‌కుమార్, విశ్రాంత శాస్త్రవేత్త సూర్యనారాయణ, పుణెకి చెందిన భద్రతాధికారి సంతోష్ ఘుగేను నియమించారు. ఈ కమిటీకి అవసరమైన పూర్తి సహకారాన్ని ఫ్యాక్టరీల డైరెక్టరేట్ అందించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రమాదానికి దారితీసిన కచ్చితమైన కారణాలను గుర్తించడం, సిగాచి పరిశ్రమ యాజమాన్యం భద్రతా నియమాలను, నిబంధనలను పాటించిందా లేదా అనే విషయాన్ని నిర్ధారించడం ఈ కమిటీ యొక్క ప్రధాన బాధ్యత. దీంతో పాటు భవిష్యత్తులో రసాయన పరిశ్రమల్లో ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై ప్రభుత్వానికి కీలక సూచనలు, సిఫార్సులు చేయాలని కమిటీని కోరింది.

మరోవైపు రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ప్రమాదం జరిగిన పరిశ్రమను సందర్శించారు. కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఘటనాస్థలంలో శిథిలాలను తొలగించే పనులను అధికారులు ప్రారంభించారు.

# బనకచర్లపై చర్చకు ఎక్కడైనా సిద్ధం

- మొదటి పేజీ తరువాయి

కేసీఆర్, హరీశ్‌రావులు సంతకాలు చేయడం వల్లే ఏపీ ప్రభుత్వం బనకచర్లను తెరపైకి తెచ్చింది. వారి తప్పిదాన్ని కప్పిపుచ్చుకొనేందుకు, సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేందుకు భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో కుల గణన జరిగిన తర్వాత కూడా భాజపా బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరి చూపిస్తోంది. రాష్ట్ర అధ్యక్ష పదవి విషయంలో బీసీల పట్ల ఆ పార్టీ వైఖరి మరోసారి తేటతెల్లమైంది. బీసీ రిజర్వేషన్లపై రైల్ రోకో చేస్తానంటున్న భారాస ఎమ్మెల్సీ కవిత... ముందుగా ఆ పార్టీ అధ్యక్ష పదవి లేదా కార్యనిర్వాహక అధ్యక్ష పదవైనా బీసీలకు వచ్చేలా చూస్తే బాగుంటుంది' అని మంత్రి వాకిటి పేర్కొన్నారు.

# సమ్మెబాట పడితే ఎస్మా తప్పదు.. కాంట్రాక్ట్ ఉద్యోగులకు టీటీడీ స్ట్రాంగ్ వార్నింగ్..



హైదరాబాద్ పెన్ పవర్: తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మెకు సిద్ధమవుతున్న క్రమంలో వారికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది టీటీడీ. సమ్మె బాట పడితే ఎస్మా చట్టం అమలు చేస్తామంటూ హెచ్చరించింది టీటీడీ. స్విమ్స్ లో విధులు నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ లోని కాంట్రాక్ట్ ఉద్యోగులు గత కొంత కాలంగా పలు రకాల కోరికలను కోరుతూ విధులను బహిష్కరించేందుకు సిద్ధపడుతున్నారని , యాజమాన్యం చాలా సామరస్యంగా పరిష్కరించాలని భావిస్తున్నట్లు తెలిపింది టీటీడీ. సదరు ఉద్యోగులు సంబంధిత శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించింది. స్విమ్స్ లో ఎస్మా చట్టం అమలులో ఉన్నందున సమ్మె నోటీస్ ఇవ్వడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది టీటీడీ. వైద్య సేవలకు ఆటంకం కల్గిస్తే విధుల నుండి తొలగించే నిబంధన ఉందని.. తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కాంట్రాక్ట్ ఉద్యోగులను కోరింది టీటీడీ. విధులను బహిష్కరించి సమ్మెకు దిగితే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. స్విమ్స్ తో సంబంధం లేని బయట వ్యక్తుల ప్రమేయంతో నిరసనలకు దిగితే చట్టప్రకారం చర్యలు తప్పవని తెలిపింది టీటీడీ. విధులను బహిష్కరించినందుకుగాను,

ఒకసారి ఉద్యోగం తొలగించాక, సదరు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోరనే విషయాన్ని గమనించాలని తెలిపింది టీటీడీ. గతంలో టిటిడిలో విధులు బహిష్కరించినప్పటికీ.. మానవతా దృక్పథంతో తిరిగి విధుల్లోకి తీసుకున్నామని... ఈసారి విధుల నుండి తొలగించాక విధులను బహిష్కరించిన వారిని ఎలాంటి పరిస్థితుల్లో తిరిగి చేర్చుకోరని టిటిడి తెలిపింది. టిటిడిలో భక్తులకు సేవలు అందించే ఉద్యోగులు ధర్నాలు చేయడం, నిరసన నోటీసులు ఇవ్వడం, ఊరేగింపులు చేయడం చట్టప్రకారం నిషేధమని... నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపింది. అదేవిధంగా, ఉద్యోగుల విధులకు టిటిడితో సంబంధం లేని బయట వ్యక్తులు ఆటంకం కల్గిస్తే చట్టపరమైన క్రిమినల్ చర్యలకు వెనుకాడమని హెచ్చరించింది టీటీడీ.

## ఏడాదిలో నెల రోజులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేయండి : కార్పొరేట్ ఆస్పత్రి డాక్టర్లకు సీఎం రేవంత్ పిలుపు



**హైదరాబాద్ పెన్ పవర్:**కార్పొరేట్ ఆసుపత్రుల్లో పని చేసే డాక్టర్లకు కీలక పిలుపునిచ్చారు సీఎం రేవంత్. ఏడాదిలో కనీసం నెలరోజులు అయినా ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేయాలని పిలుపునిచ్చారు సీఎం రేవంత్. తాను ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టిన నాటి నుంచి పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించటమే ప్రాధాన్యతగా ముందుకెళ్తున్నామని అన్నారు. ఇందుకోసం కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేసే వైద్యులు కూడా సహకారం అందించాలని కోరారు సీఎం రేవంత్.

రాష్ట్రంలో చదువుకున్న డాక్టర్లందరూ ఏడాదిలో ఒక్క నెలరోజులు అయినా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయాలని అన్నారు. 11 నెలల పాటు ఎవరికి నచ్చిన చోట నచ్చినంత జీతం తీసుకొని పని చేసి.. సామజిక బాధ్యత కింద ఏడాదిలో ఒక్క నెల అయినా ఎక్కడో ఒకచోట ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయాలని కోరారు సీఎం రేవంత్. పేదల కోసం పనిచేసినప్పుడు జాబ్ సాటిస్ఫాక్షన్ వస్తుందని అన్నారు సీఎం రేవంత్.

ఇది కేవలం తెలంగాణలో, హైదరాబాద్ లో పనిచేస్తున్న డాక్టర్లకే కాదని.. అమెరికా లాంటి విదేశాల్లో చాలామంది మనవాళ్ళు వైద్య వృత్తిలో ఉన్నారని వాళ్ళు ఎదో ఒక పని మీద ఇండియాకి వచ్చినప్పుడు సేవ చేయాలి అనుకున్నా కుడా వాళ్లకు సరైన వేదిక లేదని అన్నారు. అలాంటి వేదిక ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించానని అన్నారు సీఎం రేవంత్.

## తిరుమలలో మామూళ్ల రచ్చ.. షాపు యజమానిపై విజిలెన్స్ సిబ్బంది దాడి..



**హైదరాబాద్ పెన్ పవర్:**కలియుగ వైకుంఠం తిరుమలలో మామూళ్ల వసూళ్లు రచ్చకు దారి తీశాయి. విజిలెన్స్ సిబ్బందికి స్టూడియో యజమానికి మధ్య మామూళ్ల విషయంలో తలెత్తిన వివాదం పిడిగుద్దులు గుద్దుకునే స్థాయికి వెళ్ళింది. బుధవారం ( జులై 2 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఆలయ ఆస్థాన మండపం దగ్గర ఉన్న స్టూడియో దగ్గర చోటు చేసుకుంది ఈ ఘటన. మామూళ్ల వసూలు విషయంలో విజిలెన్స్ సిబ్బందికి స్టూడియో యజమానికి మధ్య మొదలైన మాటల యుద్ధం ఘర్షణకు దారి తీసిందని ఇతర దుకాణదారులు చెబుతున్నారు. వివాదం తారాస్థాయికి చేరడంతో విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది, స్టూడియో యజమాని పిడిగుద్దులు గుద్దుకున్నారని తెలిపారు దుకాణదారులు. ఈ ఘటనపై టీటీడీ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. అధికారుల ఆదేశాలతో ఘటనపై విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. తిరుమల కొండ మీద వ్యాపారం చేసుకొని బతికే తమపై కొంతమంది సిబ్బంది మామూళ్ల పేరుతో దౌర్జన్యానికి పాల్పడుతున్నారని.. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు దుకాణదారులు. ఈ ఘటనతో విజిలెన్స్ సిబ్బంది మామూళ్ల వసూలుకు అధికారులు అడ్డుకట్ట వేస్తారా లేదా చూడాలి.

# మృతులకు భారీ పరిహారాన్ని ప్రకటించిన పాశమైలారంలోని సిగాచి కంపెనీ

- పాశమైలారం దుర్ఘటనపై ఎట్టకేలకు స్పందించిన సిగాచి యాజమాన్యం
- మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ప్రకటన
- గాయపడిన వారికి పూర్తి వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ బాధ్యత స్వీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:**సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో పెను విషాదాన్ని మిగిల్చిన సిగాచి పరిశ్రమ ప్రమాదంపై యాజమాన్యం ఎట్టకేలకు స్పందించింది. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున భారీ పరిహారాన్ని ప్రకటించింది. గాయపడిన వారి పూర్తి వైద్య ఖర్చులతో పాటు వారి కుటుంబాల పోషణ బాధ్యతను కూడా తామే చూసుకుంటామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కంపెనీ సెక్రటరీ వివేక్, స్టాక్ మార్కెట్లకు ఓ లేఖ ద్వారా వివరాలను తెలియజేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కోటి రూపాయల పరిహారంతో పాటు, అన్ని రకాల బీమా క్లెయిమ్‌లను కూడా చెల్లిస్తామని ఆ ప్రకటనలో హామీ ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని, వారు కోలుకునే వరకు వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మొత్తం 40 మంది కార్మికులు మరణించారని, మరో 33 మంది గాయపడ్డారని కంపెనీ తన ప్రకటనలో పేర్కొంది.

పరిశ్రమలో ప్రమాదానికి రియాక్టర్ పేలుడే కారణమన్న ప్రచారాన్ని కంపెనీ తోసిపుచ్చింది. ప్రమాద కారణాలపై ప్రభుత్వ నివేదిక కోసం వేచి చూస్తున్నామని తెలిపింది. ముందుజాగ్రత్త చర్యగా పాశమైలారంలోని ప్లాంట్‌లో కార్యకలాపాలను మూడు నెలల పాటు నిలిపివేస్తున్నామని యాజమాన్యం వెల్లడించింది.

# షిర్డీసాయిని దర్శించుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్ధాంగి గీతారెడ్డి

- షిర్డీ సాయిబాబాను దర్శించుకున్న గీతారెడ్డి
- మధ్యాహ్న హారతి సేవలో పాల్గొన్న సీఎం అర్ధాంగి
- షిర్డీకి రావడం ఇదే తొలిసారని వెల్లడి
- ద్వారకామాయి, గురుస్థాన్ ఆలయాల సందర్శన



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అర్ధాంగి గీతారెడ్డి మహారాష్ట్రలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం షిర్డీని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతారెడ్డి బుధవారం షిర్డీకి చేరుకుని సాయిబాబా మధ్యాహ్న హారతి సేవలో పాల్గొన్నారు. జీవితంలో షిర్డీ క్షేత్రాన్ని సందర్శించడం ఇదే మొదటిసారని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రధాన ఆలయంలో దర్శనం అనంతరం, ఆలయ ప్రాంగణంలో ఉన్న ద్వారకామాయి, గురుస్థాన్‌లను కూడా ఆమె సందర్శించారు. శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ అధికారులు గీతారెడ్డికి స్వాగతం పలికారు. దర్శనం పూర్తయిన తర్వాత ఆలయ మర్యాదల ప్రకారం ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం సాయిబాబా జ్ఞాపికగా ఒక విగ్రహాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. గీతారెడ్డి పర్యటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

# డెడ్ బాడీలు అప్పగించే వరకు కదిలేదే లేదు.. సిగాచి కంపెనీ ముందు బాధితుల ఆందోళన



**హైదరాబాద్ పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ దగ్గర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమ కుటుంబ సభ్యులను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బాధితులు కంపెనీ ముందు ఆందోళనకు దిగారు. ప్రమాదం జరిగి మూడు రోజులు అవుతున్న తమ వాళ్ళ ఆచూకీ చెప్పడం లేదని ఆందోళన చేస్తున్నారు బాధిత కుటుంబాలు. రోజు మొత్తంలో కేవలం గంటసేపు కూడా సెర్చ్ ఆపరేషన్ కొనసాగించట్లేదని ఆరోపించారు. మా కుటుంబ సభ్యుల మృతదేహాలు అప్పగించకపోతే ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇన్సూరెన్స్ కంపెనీల కోసం శిథిలాలను తొలగించడం లేదని బాధితుల ఆరోపించారు. గంట సేపు శిథిలాలు తొలగిస్తే ఈ రోజు మూడు మృతదేహాలు దొరికాయని.. శిథిలాల తొలగింపును కంపెనీ ఇన్సూరెన్స్ ప్రతినిధుల కోసం అడ్డు కుంటున్నారని ఆరోపించారు. ఇవాళ ఒక మృతదేహం బట్టలు కూడా చిరిగిపోకుండా దొరికిందని.. కంపెనీ వెంటనే స్పందించి ఉంటే బతికే ఉండేవారేమోనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాగా, సంగారెడ్డి జిల్లా పాశ మైలారం సిగాచి ఫార్మా కంపెనీలో 2025, జూన్ 30న ఘోర ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. రియాక్టర్ పేలి దాదాపు 40 మంది వరకు మరణించగా.. మరికొందరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రియాక్టర్ పేలుడి ధాటికి కంపెనీ భవనం కుప్పకూలగా.. శిథిలాల కింద కొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వర్షం కురుస్తుండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ ఘటన జరిగి మూడు రోజులు కావొస్తోన్న ఇప్పటి వరకు కొందరి ఆచూకీ దొరకలేదు. దీంతో బాధితుల కుటుంబ సభ్యులు కంపెనీ ముందు పడిగాపులు కాస్తున్నారు. ఘటన జరిగి మూడు రోజులు గడిచినప్పటికీ తమ వారి ఆచూకీ చెప్పకపోవడంతో

ఓ వైపు బాధ.. మరోవైపు అసహనంతో బుధవారం (జూలై 2) ముందు ఆందోళనకు దిగారు. తమ వారి ఆచూకీ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు రియాక్టర్ పేలుడు ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు సిగాచి కంపెనీ రూ.కోటి చొప్పున నష్టం పరిహారం ఇస్తామని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ఘోర విషాదాల్లో ఒకటిగా నిల్చిన సిగాచి కంపెనీ పేలుడు ఘటన ఎన్నో కుటుంబాల్లో పూడ్చలేని విషాదాన్ని మిగిల్చింది.

# నిరుద్యోగి క్రూరత్వం: అసూయతో ఆమెని చంపి, 2 రోజులు శవం పక్కనే..




**హైదరాబాద్ పెన్ పవర్:** భోపాల్‌లోని గాయత్రి నగర్‌లో 29 ఏళ్ల మహిళను ఆమె ప్రియుడు గొంతు కోసి చంపిన దారుణ ఘటన ఆ నగరాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. 32 ఏళ్ల సచిన్ రాజ్‌పుత్, రితికా సేన్‌ను చంపడమే కాకుండా, ఆమె శరీరాన్ని దుప్పటిలో చుట్టి అసలు ఏం జరగనట్లు నటిస్తూనే రెండు రాత్రులు ఆమె పక్కనే పడుకున్నాడు. అయితే గత నెల జూన్ 27న రాత్రి వీరి మధ్య తీవ్ర వాగ్వాదం తర్వాత ఈ హత్య జరిగింది. ఉద్యోగం లేకపోవడంతో మాదక ద్రవ్యాలకు, మద్యానికి బానిసైన సచిన్ ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న రితికాకు ఆమె పని చేసే యజమానితో సంబంధం ఉందని అనుమానించాడు. దీంతో వీరి మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరిగి కోపంతో అతను ఆమె గొంతు కోసి చంపాడు. తరువాత సచిన్.. రితికా మృతదేహాన్ని ఒక దుప్పటిలో చుట్టి, మంచం మీద అదే గదిలోనే ఉన్నాడు. పోలీసుల ప్రకారం అతను రెండు రోజుల పాటు మృతదేహం పక్కనే పడుకున్నాడు. గత ఆదివారం రోజున మద్యం తాగి, మనస్తాపం చెందిన సచిన్ తన స్నేహితుడు అనుజ్‌తో ఈ హత్య విషయాన్నీ చెప్పాడు. కానీ అనుజ్ మొదట అతని మాట నమ్మలేదు. కానీ మరుసటి రోజు ఉదయం సచిన్ అదే విధంగా మాట్లాడటంతో, సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో అనుజ్ చివరకు పోలీసులకు ఫోన్ చేశాడు. పోలీసులు అతను ఉంటున్న అద్దె ఇంటికి వెళ్ళి చూడగా సచిన్ వివరించినట్లుగానే రితికా మృతదేహం కుళ్ళిపోయి దుప్పటిలో చుట్టి మంచం మీద పడి ఉంది. అంతేకాదు వీరిద్దరూ మూడున్నర సంవత్సరాలుగా లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్నారు అని పోలీసులు తెలిపారు.

పోలీసులు మాట్లాడుతూ "చనిపోయిన మహిళను రితికా సేన్ అని గుర్తించారు. ఆమె తన ప్రియుడు సచిన్ రాజ్‌పుత్‌తో నివసిస్తోంది, అతనికి ముందే వివాహమై ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. జూన్ 27 రాత్రి వీరి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ తీవ్రమై సచిన్ ఆమెను గొంతు కోసి చంపాడు. తరువాత మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి అదే గదిలోనే ఉన్నాడు. చివరకు తాగిన మత్తులో అతను తన స్నేహితుడికి ఈ విషయాన్నీ చెప్పగా అతను పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

సచిన్ విదిషలోని సిరోంజ్ కు చెందినవాడు. రితిక అతను దాదాపు 9 నెలల క్రితం గాయత్రి నగర్లోకి మకాం మారారు. రితిక జాబ్ చేస్తుండగా, సచిన్ నిరుద్యోగిగా ఉండేవాడు. సచిన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని పై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హుందాయ్ క్రెటా రికార్డ్ అమ్మకాలు.. జూన్ నెలలో దేశంలోనే 'బెస్ట్ సెల్లింగ్ కార్'




**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ ప్రజలు ఎక్కువగా ఎస్ యూవీ మోడల్ కార్లను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్న సంగతి తెలిసిందే. దీంతో 2015లో భారత మార్కెట్లోకి తొలిసారిగా విడుదలైన హుందాయ్ క్రెటా తన అమ్మకాల విజయ పరంపరను కొనసాగిస్తోంది. తాజాగా క్రెటా జూన్ 2025లో ఏకంగా 15వేల 786 యూనిట్లు అమ్ముడు కావటంతో దేశంలో బెస్ట్ సెల్లింగ్ కార్ గా నిలిచింది. మార్చి, ఏప్రిల్ మాసాల్లో కూడా క్రెటా ఇదే అమ్మకాల దూకుడును కొనసాగించింది. ప్రస్తుతం ఈ మిడ్ ఎస్ యూవీ కేటగిరీలో హుందాయ్ క్రెటాకు పోటీగా మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా, కియా సెల్టోస్, టాటా కర్వ్, టయోటా అర్బన్ క్రూయిజ్ హైరైజర్, హోండా ఎలివేట్, స్కోడా కుషక్, ఫోక్స్ వ్యాగన్ టైగన్, ఎంజీ ఆస్టర్ మోడల్స్ ఉన్నాయి. కంపెనీ ప్రస్తుతం క్రెటాలో మరింతగా కస్టమర్ అనుభూతి పెంచేలా తీర్చిదిద్దాలని చూస్తోంది. హుందాయ్ క్రెటాను లాంచ్ చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 12 లక్షల భారతీయ కుటుంబాలు కొనుగోలు చేశారని కంపెనీ సీఓఓ తరుణ్ గార్గ్ వెల్లడించారు. ఇండియాలో హుందాయ్ వ్యాపారానికి ఎస్ యూవీ అమ్మకాలు మూల స్థంభంగా నిలిచినట్లు చెప్పారు. గడచిన పదేళ్లుగా క్రెటా అమ్మకాల విజయపరంపర కొనసాగుతోందని, భారతీయ కస్టమర్లలో ఈ మోడల్ మంచి ఆదరణ, గుర్తింపును తెచ్చుకుందని గార్గ్ చెప్పారు. లాంచ్ సమయం నుంచి ప్రతి ఏటా క్రెటా మిడ్ సైజ్ ఎస్ యూవీల అమ్మకాల్లో మొదటి స్థానంలో నిలిచిందని హుందాయ్ మోటార్స్ ఇండియా వెల్లడించింది.

# చాట్‌జీపీటీపై అతిగా ఆధారపడొద్దు: ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ వార్నింగ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ మధ్య కాలంలో ఏఐ పేరు ఎక్కువగా వినిపిస్తుంది. అంతేకాకుండా దీని వినియోగం కూడా పెరిగింది. అయితే ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ మాత్రం అతను రూపొందించిన చాట్‌జీపీటీపై యూజర్లు ఎక్కువగా ఆధారపడకూడదని హెచ్చరించారు. ఒక ఓపెన్ ఏఐ పాడ్‌కాస్ట్లో అతను మాట్లాడుతూ ప్రజలు చాట్‌జీపీటీపై హై లెవెల్ నమ్మకాన్ని ఉంచడం తనకు ఆసక్తికరంగా అనిపించిందని అన్నారు. ఇంకా AI తప్పుదోవ పట్టించే విధంగా లేదా తప్పుడు సమాచారాన్ని ఇచ్చే అవకాశం కూడా ఉందని చెబుతూ.. దానిని ఎక్కువగా నమ్మొద్దని ఆయన సూచించారు. "చాట్‌జీపీటీపై ప్రజలకు చాలా నమ్మకం ఉంది, ఇది చూస్తుంటే నిజంగా ఆసక్తికరంగా ఉంది నాకు, ఎందుకంటే AI మీరు అంతగా నమ్మలేని టెక్నాలజీ అది" అని ఆల్ట్‌మాన్ చాట్‌జీపీటీ గురించి చెప్పారు.

**టెక్నాలజీ ఇంకా గోప్యతా సమస్యలు:**

అయితే అతని పాడ్‌కాస్ట్ సమయంలో ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ మాట్లాడుతూ చాట్‌జీపీటీ కొత్త ఫీచర్లతో అభివృద్ధి చెందుతున్నగాని టెక్నాలజీకి ఇప్పటికీ కొన్ని పరిమితులు, నియమాలు ఉన్నాయని, వాటిని పారదర్శకతతో పరిష్కరించాల్సిన అవసరం ఉందని అంగీకరించారు.




**కాపీరైట్ వివాదాలు:**

ది న్యూయార్క్ టైమ్స్‌తో సహా మీడియా సంస్థల నుండి కంటెంట్ వాడకం అలాగే కాపీరైట్ సమస్యలపై ఓపెన్‌ఏఐ చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో సామ్ ఆల్ట్‌మాన్ ఈ విధంగా అన్నారు. ఈ ఆందోళనలకు ప్రతిస్పందనగా ఆల్ట్‌మాన్ తమ కంపెనీ కట్టుబడి ఉందని నొక్కి చెప్పారు. టెక్నాలజీ పై ప్రస్తుతం ఉన్న నమ్మకాన్ని ప్రస్తావిస్తూ ఇది అంతగా నమ్మదగినది కాదు అని కూడా ఒప్పుకున్నారు.

తాజాగా ఆల్ట్‌మాన్ AI హార్డ్‌వేర్ అవసరాలపై తన వైఖరిని మార్చుకున్నాడు. AI విప్లవానికి కొత్త హార్డ్‌వేర్ అవసరం లేదని ఆయన గతంలోనే పేర్కొన్నారు. కానీ ఇప్పుడు ప్రస్తుత కంప్యూటర్లు AI లేని ప్రపంచం కోసం రూపొందించబడ్డాయి అని చెప్పుకొచ్చారు. కృత్రిమ మేధస్సు మరింత ప్రబలంగా మారుతున్నందున వినియోగదారులకు కొత్త పరికరాలు అవసరమని సూచించారు. అతనితో పాటు జాక్ ఆల్ట్‌మాన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్ ఇంకా హార్డ్‌వేర్ AI లేని ప్రపంచం కోసం రూపొందించబడ్డాయి అని తెలిపారు, ఈ మాటలు AI-ఆధారిత కోణంలో చూస్తే వినియోగదారుల అవసరాలు వేగంగా మారుతున్నాయని చూపుతుంది.

## ఐపీఎస్ పదవికి సిద్దార్థ్ కౌశల్ రాజీనామా.. ఎందుకంటే..?



Press Statement

by Siddharth Kaushal, IPS

I have tendered my voluntary resignation from the Indian Police Service - a decision made on purely personal grounds after deep personal reflection. It is a step taken in alignment with my long-term life goals and the wishes of my family members.

Recently, certain reports have attempted to falsely link my resignation to alleged harassment or external pressure. I wish to state unequivocally that such claims are completely baseless and misleading. My decision is entirely independent, personal, and voluntary.

Serving in the IPS has been the most fulfilling and enriching journey of my life. My years in Andhra Pradesh have been a privilege - I have always considered this state my home, and its people will remain in my heart with deep affection and pride.



**హైదరాబాద్ పెన్ పవర్:** యంగ్ ఐపీఎస్ ఆఫీసర్ సిద్దార్థ్ కౌశల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. స్వచ్ఛందంగా ఐపీఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు 2025, జూలై 2న లేఖ విడుదల చేశారు. పూర్తిగా వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నానని.. నా రాజీనామాకు ఎలాంటి బలవంతం, వేధింపులు లేవని స్పష్టం చేశారు సిద్దార్థ్ కౌశల్. దీర్ఘకాలిక జీవిత లక్ష్యాలు, నా కుటుంబ సభ్యులతో చర్చించ తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు. రాజకీయ వేధింపులతో రాజీనామా చేస్తోన్నట్లు వస్తోన్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, తప్పుదారి పట్టించేవని అన్నారు సిద్దార్థ్ కౌశల్. రాజీనామా నిర్ణయం పూర్తిగా వ్యక్తిగతంగా తీసుకుంటున్నానన్నారు. ఐపీఎస్‌గా సేవ చేయడం ఎంతో సంతృప్తి ఇచ్చిందని.. ఇది నా జీవితంలో ఓ అద్భుత ప్రయాణమన్నారు. ఆంధ్రప్రదేశ్?ను నా సొంత ఇల్లుగా భావించానని.. ఇక్కడి ప్రజలు నాపై చూపించిన ప్రేమ ఎప్పటికీ హృదయంలో నిలిచి ఉంటాయన్నారు కౌశల్. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, నా సీనియర్లకు, సహెూద్యోగులకు, జూనియర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని..
మీ మద్దతు, నమ్మకం నన్ను ఉన్నత స్థాయిలో నిలబెట్టాయని పేర్కొన్నారు సిద్దార్థ్ కౌశల్. రాబోయే రోజుల్లో కొత్త మార్గాల్లో సమాజానికి సేవ చేస్తానన్నారు. గతంలో కృష్ణా, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లో ఎస్పీగా పని చేసిన సిద్దార్థ్ కౌశల్ ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో ఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రభుత్వ పెద్దలతో అంటకాగారనే ఆరోపణలపై కూటమి ప్రభుత్వం సిద్దార్థ్ కౌశల్?కు పోస్టింగ్ ఇవ్వకుండా పక్కన పెట్టింది. డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసింది. ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో ఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్విర్తిస్తున్న సిద్దార్థ్ కౌశల్.. వీఆర్ఎస్?కు దరఖాస్తు చేసుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వ రాజకీయ వేధింపుల వల్లే ఐపీఎస్ ఆఫీసర్ సిద్దార్థ్ కౌశల్ వీఆర్ఎస్ తీసుకుంటున్నారని ప్రతిపక్ష వైసీపీ ఆరోపిస్తోంది. దీంతో సిద్దార్థ్ కౌశల్ వీఆర్ఎస్ వ్యవహారం ఏపీ పాలిటిక్స్?లో హాట్ టాపిక్ గా మారింది.

## స్టూడెంట్ వీసాదారులకు షాక్.. ట్రంప్ సర్కార్ ఆ నిర్ణయంతో కష్టాలే..




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా వెళ్లటం అక్కడ ఉన్నత చదువులు పూర్తి చేసి అక్కడే మంచి కెరీర్ స్టార్ చేసి స్థిరపడాలి అనేది ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది యువతకు ఉండే కల. అయితే ఇది భారతదేశపు యువతలోనూ, ప్రధానంగా మధ్యతరగతి కుటుంబాలకు ఉండే లైఫ్ టైం డ్రీమ్. అందుకే పొలాలు, ఆస్తులు అమ్మైనా చాలా మంది తమ పిల్లలను అమెరికాకు పంపేందుతు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తల్లిదండ్రులు ఇష్టపడుతుంటారు. అయితే ప్రస్తుతం అమెరికాలోని యూనివర్సిటీల్లో విదేశీ విద్యార్థులు నిరసనలు చేయటం వంటి వాటిపై ట్రంప్ సర్కార్ సీరియస్ గా ఉంది. ఈక్రమంలోనే అమెరికాకు వచ్చే విద్యార్థుల వీసా ప్రాసెసింగ్ ప్రక్రియను అత్యంత కఠినతరంగా మార్చటంతో పాటు వారి సోషల్ మీడియా ఖాతాలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో అమెరికాకు విద్య కోసం వస్తున్న విదేశీ విద్యార్థులకు మరో షాక్ ఇచ్చేందుకు రంగం సిద్ధం అవుతోంది. అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం అంతర్జాతీయ విద్యార్థులకు ఉన్న వీసా గడువు కాలాన్ని తగ్గించాలని చూస్తోంది. దీనికి తోడు ఎక్స్ఛేంజ్ సందర్శకులు, విదేశీ సమాచార మీడియా ప్రతినిధుల బసకు అనుమతింటే కాలాన్ని తగ్గించాలని అమెరికా అధికారులు ప్రతిపాదించారు. ఇది అంతర్జాతీయ విద్యార్థులకు ఇబ్బందులను మరింతగా పెంచవచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఇప్పటికే దీనికి సంబంధించి ప్రతిపాదనను అమెరికాలోని హోమ్ లాండ్ సెక్యూరిటీ ఆఫీస్ ఆఫ్ మేనేజ్మెంట్ అండ్ బడ్జెట్ విభాగానికి అందించింది. దీని ఉన్నతాధికారి నేరుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కి నేరుగా రిపోర్ట్ చేస్తారని సమాచారం. దీనిని కూడా అమలులోకి తీసుకొస్తే ఇప్పటికే ఉన్న యూఎస్ వీసా కష్టాలు మరింతగా ముదిరిపోతాయని వీసా నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతవారం భారతదేశంలోని అమెరికా ఎంబసీ కార్యాలయం విదేశీ విద్యార్థులతో పాటు యూఎస్ వీసా దరఖాస్తుదారులందరికీ తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అందించటంతో పాటు వాటిని పబ్లిక్ చేయాలని వెల్లడించింది. ఈ వివరాలను దాచిపెట్టినా లేదా తప్పుడు సమాచారం పంచుకున్నా అమెరికా వీసా పొందటానికి వారు అనర్హులుగా మారతారని హెచ్చరించిన సంగతి తెలిసిందే.

# బంగారం కొనుగోలుదారులకు షాకిచ్చిన ధరలు.. ఎంత ఉన్నాయంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:**బంగారం ధరలు పైకి చూస్తుంటాయి. గత కొద్ది రోజులుగా పతనం దిశగా పయనిస్తున్న బంగారం ధరలు మళ్లీ పరుగును ప్రారంభించాయి. ధరలు పెరుగుదల ఎవరి చేతుల్లోనూ ఉండదు. ఒక్కసారిగా ధరలు పెరుగుతుంటాయి. కొనుగోలు చేద్దామని అనుకునే లోపు ధరలను చూసి షాక్ తినాల్సి వస్తుంది. అందుకే బంగారం విషయంలో ఎప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే ఇవి నిలకడగా ఉండవు. నిత్యం ధరల్లో మార్పులు, చేర్పులు ఉంటాయి. ధరలు కొంత తగ్గినప్పుడే కొనుగోలు చేయడం మంచిదని, ఇంకా ధరలు తగ్గుతాయని భావించి ఎదురు చూపులు చూస్తే చివరకు ఆశాభంగమే మిగులుతుందని వ్యాపారులు సయితం చెబుతున్నారు.

**ఈ ఏడాది బ్యాడ్ లక్...**

బంగారం ధరలు పెరగడానికి అనేక కారణాలున్నా ఎందుకో 2025 సంవత్సరం బంగారం ప్రియులకు చేదు మిగిల్చింది. వారి ఆశలపై నీళ్లు చల్లింది. ఏడాది ప్రారంభం నుంచి బంగారం, వెండి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. మధ్యలో కొంత తగ్గినా అది స్వల్పంగా మాత్రమే. అందుకే బంగారం ధరల పెరుగుతున్నాయని బాధపడకూడదు. తగ్గాయని సంతోష పడకూడదు. అంతర్జాతీయ మార్కెట్ లో ధరల ఒడిదుడుకులు, ద్రవ్యోల్బణం, డాలర్ తో రూపాయి తగ్గుదల, విదేశాల్లో నెలకొన్న మాంద్యం, యుద్ధాలు ఆగిపోవడం వంటి కారణాలతో ధరల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదే సమయంలో ధరలు మరింత పెరిగే అవకాశముందని చెబుతున్నారు.

**మళ్లీ పెరిగి...**

శ్రావణమాసం వస్తుండటంతో బంగారం కొనుగోళ్లు పెరుగుతాయి. ఈ మాసంలో మహిళలు ఎక్కువగా బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. అందుకే ఈ నెలలో మళ్లీ ధరలు పెరిగే అవకాశముందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈరోజు దేశంలో బంగారం ధరలు పెరిగాయి. వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి. పది గ్రాముల బంగారం ధరపై పది రూపాయలు పెరిగింది. కిలో వెండి ధరపై వంద రూపాయలు పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో బంగారం, వెండి ధరలు ఇలా ఉన్నాయి. 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 90,210 రూపాయలుగా ఉంది. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 98,410 రూపాయలుగా నమోదయింది. కిలో వెండి ధర 1,20,100 రూపాయల వద్ద ట్రేడ్ అవుతుంది.

## వైసీపీ నేత వల్లభనేని వంశీ జైలు నుండి విడుదల



**హైదరాబాద్ పెన్ పవర్:**వైసీపీ నేత వల్లభనేని వంశీ జైలు నుంచి విడుదలయ్యారు. 2025 ఫిబ్రవరి 13న అరెస్టైన వల్లభనేని వంశీ.. 137 రోజుల పాటు సబ్ జైలులో ఉన్నారు. గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి కేసులో వంశీని అరెస్ట్ చేసిన పోలీసులు ఆయనపై పలు స్టేషన్లలో 11 కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ( జులై 1 ) నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వంశీకి బెయిల్ మంజూరు చేసింది నూజివీడు కోర్టు. దీంతో వంశీపై ఉన్న కేసుల్లో బెయిల్ వచ్చినట్లయ్యింది. బుధవారం ( జులై 2 ) జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు వల్లభనేని వంశీ.

ఇదిలా ఉండగా.. వంశీకి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మైనింగ్ కేసులో వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్ రద్దు చేయాలని ఏపీ సర్కార్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ వాయిదా వేసింది సుప్రీంకోర్టు. బుధవారం ( జులై 2 ) ఈ పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు విచారణను జులై 16 కు వాయిదా వేసింది. మైనింగ్ వాల్యూయేషన్ పై నివేదిక ఇచ్చిన తర్వాత విచారణ జరుపుతామని తెలిపింది సుప్రీంకోర్టు.సీల్డ్ కవర్ లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది సుప్రీంకోర్టు.మైనింగ్ కేసులో తమ వాదన వినకుండా వంశీకి బెయిల్ ఇచ్చారని సుప్రీంకోర్టుకు తెలిపారు ప్రభుత్వం తరపు న్యాయవాది సిద్ధార్థ లూత్రా. 195 కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ జరిగిందని.. సీల్డ్ కవర్ లో నివేదిక ఇస్తామని కోర్టుకు తెలిపారు లూత్రా. ఈ క్రమంలో కేసు విచారణ జరిపిన జస్టిస్ ఎంఎం సుందరేశ్ , జస్టిస్ కే వినోద్ చంద్రన్ ల ధర్మాసనం... తదుపరి విచారణ ఈనెల 16కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది.మంగళవారం ( జులై 1 ) నకిలీ ఇళ్ల పట్టాల కేసులో వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరు చేసింది నూజివీడు కోర్టు. దీంతో తనపై నమోదైన అన్ని కేసుల్లో వంశీకి బెయిల్ వచ్చినట్లయ్యింది. దీంతో కృష్ణా జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వంశీ ఇవాళ ( జులై 2 ) విడుదలయ్యారు. అయితే.. మైనింగ్ కేసులో వంశీ ముందస్తు బెయిల్ రద్దు చేసి ఆయన విడుదలను ఆపాలనుకున్న కూటమి సర్కార్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురైందనే చెప్పాలి. ఈ క్రమంలో ఈ నెల 16న సుప్రీంకోర్టులో వంశీ బెయిల్ రద్దు పిటిషన్ పై విచారణ పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.2025 ఫిబ్రవరి 13న హైదరాబాద్?లో వల్లభనేని వంశీని అరెస్ట్ చేశారు పోలీసులు. గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీని అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ కేసులో వంశీ నిందితుడిగా ఉన్నారు. 2024 ఫిబ్రవరి 20న గన్నవరం టీడీపీ కార్యాలయంపై అప్పుడు గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్న వల్లభనేని వంశీ అనుచరులు, వైసీపీ నాయకులు దాడి చేసి నిప్పుబెట్టారు.గన్నవరం టీడీపీ కార్యాలయం ఆపరేటర్ ముదునూరి సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐపీసీ సెక్షన్ 143, 147, 148, 435, 506 రెడ్?విత్ 149, 3(1) (ఎస్సీ, ఎస్టీ చట్టం) కింద కేసు నమోదు చేశారు.

## హైదరాబాద్ సిటీ శివార్లలో ఆలయాలను టార్గెట్ చేసిన ముఠా : విగ్రహాల దోపిడీనే వీళ్ల పని




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటీవల ఇళ్ళు, గుళ్ళు అన్న తేడా లేకుండా రెచ్చిపోయి చోరీలకు పాల్పడుతున్నారు దొంగలు. ఇళ్లలో బంగారం దగ్గర నుంచి బయట వదిలిన షూస్, చెప్పులు కూడా వదిలిపెట్టకుండా ఎత్తుకెళ్తున్నారు. ఇక ఆలయాలను టార్గెట్ చేసుకున్న దొంగలు ఏకంగా విగ్రహాలనే దొంగలిస్తున్నారు.ఈ క్రమంలో హైదరాబాద్ సిటీ శివార్లలో ఆలయాలే టార్గెట్ గా చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేశారు పోలీసులు. రాచకొండ కమిషనరేట్ కమిషనరేట్ పరిధిలో ఆలయాల్లో పంచలోహ విగ్రహాలు చోరీ చేస్తున్న ముఠాను బుధవారం ( జులై 2 ) అదుపులోకి తీసుకున్నారు ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్ సిసిఎస్ పోలీసులు.

దుండగులు ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, యాచారం, అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో చోరీ చేసినట్లు గుర్తించారు. సిటీ శివార్లలోని దేవాలయాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి దగ్గర నుంచి రూ. 5 లక్షల 36 వేల 300 విలువజేసే పంచలోహ విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు ఏపీ కి చెందిన శివానంద, షరీఫ్ దేవాలయాల్లో పంచలోహ విగ్రహాల చోరీలే కాకుండా ఉప్పల్ లో ఒక బైక్ కూడా దొంగలించినట్లు తెలిపారు పోలీసులు. నిందితులు మద్యం మత్తులో నేరాలు చేస్తున్నారని.. చోరీ చేసిన విగ్రహాలు ఉప్పల్ కు చెందిన క్రాంతి కుమార్ అనే వ్యక్తి కి అమ్ముతున్నట్లు గుర్తించామని తెలిపారు పోలీసులు. నిందితులకు సహకరిస్తున్న క్రాంతి కుమార్ ను కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు పోలీసులు.

నిందితులు నగర శివార్లలో సీసీ కెమెరాలు లేని దేవాలయాలనే టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు పోలీసులు. ఈ క్రమంలో ప్రతి దేవాలయంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు పోలీసులు.

# మాధవా..? మారుస్తావా? ముందుకు తీసుకెళ్లగలవా?



**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా పీవీఎన్వీ మాధవ్ ను నాయకత్వం ఎంపిక చేసింది. అయితే ఎవరికి వారు మాధవ్ మావాడే అంటూ ఓన్ చేసుకనే ప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియాలో టీడీపీ సానుభూతి పరులు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు మాధవ్ అని కథనాలు వండి వారుస్తుంటే, మరొకవైపు వైసీపీ కూడా చంద్రబాబు వ్యతిరేక వర్గంలో మాత్రమే కాకుండా, జగన్ కు అనుకూలంగా మాధవ్ ఉంటారని లెక్కలు వేస్తున్నారు. ఇంతకూ మాధవ్ ఎంపిక ఎలా జరిగిందన్న దానిపై అనేక మంది రాజకీయ ఔత్సాహికులు ఆరా తీస్తున్నారు. పార్టీ అధినాయకత్వం మాత్రం మాధవ్ అందరి వాడు అని చెప్పి అధ్యక్ష పదవికి ఎంపిక చేసినట్లు కనపడుతుంది.

**రెండు వర్గాలుగా...**

ఆంధ్రప్రదేశ్ బీజేపీలో రెండు వర్గాలు ఉన్న మాట ఎవరూ కాదనలేరు. ఒకటి చంద్రబాబు అనుకూల వర్గం కాగా, మరొకటి జగన్ కు పరోక్షంగా మద్దతిచ్చే వర్గం. ఈ రెండు వర్గాలను కలుపుకుని వెళ్లేలా మాధవ్ ను ఎంపిక చేశారంటారు. మాధవ్ ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న నేత కావడంతో పాటు పార్టీకి లాయల్ గా ఉండటం కూడా అదనపు బలం అవుతుందని పార్టీ నమ్మింది. రెండు వర్గాలను సమంగా చేరదీసి పార్టీని ముందుకు నడిపే వ్యక్తి కోసం నాయకత్వం ఎంపిక చేసిందంటున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు పగ్గాలు అప్పగిస్తే వారు ఒకవైపు మొగ్గు చూపే అవకాశముందని భావించిన పార్టీ నాయకత్వం తెలివిగా మాధవ్ ను ముందు పెట్టి కథను నడిపించాలని డిసైడ్ అయింది.

**కుటుంబ నేపథ్యం చూసినా...**

మాధవ్ ఎవరికి అనుకూలం కాదు. అలాగే ఎవరికీ వ్యతిరేకం కాదు. పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర నాయకత్వం ఆదేశాలను అమలు చేసేందుకు ఆయన ప్రయత్నిస్తారంటున్నారు. తొలి నుంచి మాధవ్ ఫ్యామిలీ చరిత్ర పరిశీలించినా ఐదు దశాబ్దాల నుంచి ఆ కుటుంబం బీజేపీలోనే ఉంది. పార్టీ గట్టు దాటి బయటకు అడుగు మోపే వ్యక్తి కాదు. అలాగే యువకుడు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు అందరినీ మెప్పించి, ఒప్పించి రాజకీయంగా పార్టీలో సమస్యలు తలెత్తినా ఢిల్లీ వైపు చూడకుండా చేయడంలో దిట్ట అని పార్టీ కేంద్ర నాయకత్వం నమ్మింది. అందుకే మాధవ్ ఎంపిక జరిగిందన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలిసింది. మరి మాధవ్ నాయకత్వంలో బీజేపీ ఏ విధంగా ముందుకు వెళుతున్నది చూడాల్సి ఉంది.

# సిగాచీ పరిశ్రమ పేలుడులో విషాదం పెరుగుతున్న మృతుల సంఖ్య




**హైదరాబాద్ పెన్ పవర్:**పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన పేలుడులో మృతుల సంఖ్య 46కు చేరింది. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలుడు సంభవించి భవనం కుప్పకూలింది. ఈ శిథిలాల కింద మరో పదహారు మృతదేహాలను సహాయక బృందాలు వెలికి తీశాయి. పేలుడు జరిగిన వెంటనే ఐదుగురు సజీవదహనమయినట్లు గుర్తించారు. తర్వాత గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూమరికొందరు మరణించారు. గాయపడిన 30 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులుచెబుతున్నారు. మరో పథ్నాలుగు మంది ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. అయితే అర్ధరాత్రి సమయానికి మర ఐదుగురి మృతదేహాలను వెలికి తీయగా మరో 9 మంది జాడ మాత్రం తెలియడం లేదు.

**గుర్తుపట్టలేని పరిస్థితుల్లో...**

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. గుర్తు పట్టలేని విధంగా మృతదేహాలు తయారయ్యాయి. దీంతో గుర్తుపట్టలేని మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలను నిర్వహించి వారి బంధువులకు అప్పగిస్తున్నారు. పటాన్ చెరు ఏరియా ఆసుపత్రిలో పదమూడు మృతదేహాలను గుర్తించారు. మిగిలిన మృతదేహాలు ఎవరివో తెలియడం లేదు. పేలుడు తీవ్రతకు గాయపడి, మంటల్లో చిక్కుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన వారిని మాత్రం గుర్తు పట్టగలిగారు. కొన్ని మృతదేహాలు గుర్తు పట్టలేనంత పరిస్థితుల్లో ఉన్నాయి. ఫోరెన్సిక్ నిపుణులు సంఘటన స్థలికి చేరుకుని పేలుడు ప్రాంతంలో ఎముకలు, దంతాలు వంటి నమూనాలను మాత్రం సేకరించారు.

**కొనసాగుతున్న శిథిలాల తొలగింపు...**

ప్రమాద సమయంలో మొత్తం 108 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అందులో ఎక్కువగా ఉత్తర్ ప్రదేశ్, ఒడిశా, బీహార్ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. ఫస్ట్ షిఫ్ట్ లో ప్రమాదం జరగడంతో నైట్ డ్యూటీ రిలీవ్ చేయడానికి వేచి ఉన్న వారిలో కూడా కొందరు మరణించి ఉండవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. భవనం కుప్ప కూలిపోవడంతో శిథిలాల తొలగింపు కార్యక్రమం జరగుతుంది. శిథిలాలను పూర్తిగా తొలగిస్తే తప్ప మరికొన్ని మృతదేహాలు లభ్యమయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా, ఫైర్ సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తున్నా ఇంకా వెలికితీత పనులు ఒక కొలిక్కి రాలేదు. సిగాచీ పరిశ్రమలో పేలుడు అనేకమంది కార్మిక కుటుంబాల్లో విషాదం నింపింది.

## బెంగళూరు ఇన్ఫోసిస్‌లో అంత మంచి జాబ్ చేస్తూ.. ఇంత నీచమైన పని ఎలా చేశాడో..!



**హైదరాబాద్ పెన్ పవర్:** పేరుమోసిన ఐటీ కంపెనీలో ఉద్యోగం. మంచి పొజిషన్ కూడా. ఐదంకెల జీతం. అందమైన జీవితం. ఇంత మంచి స్థితిలో ఉన్న ఇతనికి ఎందుకీ పాడు బుద్ధి పుట్టిందో గానీ నీచానికి దిగజారాడు. మహిళా ఉద్యోగులు ఆఫీస్ వాష్ రూమ్స్ వాడుకుంటున్న సమయంలో వారికి తెలియకుండా సీక్రెట్?గా వీడియోలు తీశాడు. ఒక మహిళా ఉద్యోగికి రెడ్ హ్యాండెడ్?గా దొరికిపోవడంతో ఇతగాడి నీచ కృత్యం వెలుగులోకి వచ్చింది.

ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరు ఇన్ఫోసిస్ ఆఫీస్?లో నగేష్ స్వప్నిల్ మాలి అనే యువకుడు సీనియర్ అసోసియేట్?గా పనిచేస్తున్నాడు. బయటకు

అందరితో మంచిగా ఉంటూ కనిపించే నగేష్?లో ఒక మృగం దాగి ఉందని తెలిసి సహోద్యోగులు షాకయ్యారు. ఒక మహిళా ఉద్యోగి వాష్ రూం యూజ్ చేసుకోవడానికి వెళ్లింది. తాను టాయ్?లెట్ యూజ్ చేస్తున్న సమయంలో నగేష్ వీడియో రికార్డ్ చేస్తున్నాడని గుర్తించిన సదరు మహిళా ఉద్యోగి ఉలిక్కిపడింది.వెంటనే.. అలారం ప్రెస్ చేయడంతో ఇతర ఉద్యోగులు అక్కడికి వెళ్లి నగేష్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నగేష్ ఫోన్ లాక్కుని చూడగా సదరు మహిళా ఉద్యోగి వాష్ రూం వీడియో అందులో ఉంది. ఆ మహిళ సమక్షంలోనే హెచ్ఆర్ విభాగం ఆ వీడియోను ఫోన్ నుంచి తొలగించింది. ఇది చిన్న విషయం కాదని.. నగేష్ మొబైల్ ఫోన్?ను ఫోరెన్సిక్?కు పంపించామని.. డిలీట్ అయిపోయిన కంటెంట్?ను తిరిగి చూస్తే గానీ గతంలో కూడా ఇలా ఇతర మహిళల వీడియోలు తీశాడో.. లేదో తెలుస్తుందని పోలీసులు తెలిపారు. ఆ మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు నగేష్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## పాపం ఫిష్ వెంకట్.. వెంటిలేటర్‌పై ట్రీట్‌మెంట్.. ఆయనకు అసలు ఏమైందంటే..

త**హైదరాబాద్ పెన్ పవర్:**లుగు సినీ నటుడు ఫిష్ వెంకట్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విలన్ గ్యాంగ్?లో కనిపిస్తూ నవ్వులు పూయించే ఫిష్ వెంకట్ ప్రస్తుతం వెంటిలేటర్?పై చికిత్స పొందుతున్నాడు. ఆయన కిడ్నీలు పూర్తిగా పాడయిపోవడంతో వైద్యులు డయాలసిస్ చేస్తున్నారు. అయినప్పటికీ ఆయన ఆరోగ్యం కుదుటపడలేదు. కొన్ని నెలల క్రితం ఇలానే ఫిష్ వెంకట్ అనారోగ్యానికి గురికావడంతో చికిత్స అందించారు. ఆ సమయానికి ఆయన ఆరోగ్యం మెరుగుపడింది. మళ్లీ.. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కిడ్నీ ట్రాన్స్?ప్లాంట్ ఒక్కటే ఆయన కోలుకోవడానికి ఉన్న ఒకేఒక్క ఆప్షన్ అని వైద్యులు తేల్చి చెప్పారు.వన్?లైనర్స్?తో, తెలంగాణ యాసతో ఫేమస్ అయిన ఫిష్ వెంకట్ మళ్లీ కోలుకుని మామూలు మనిషి కావాలంటే ఆయన వైద్యానికి చాలానే ఖర్చవుతుంది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఆయన కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. సినీ ఇండస్ట్రీ నుంచి ఎవరైనా స్పందించి ఫిష్ వెంకట్ వైద్యానికి సాయం చేయాలని ఆ కుటుంబం కోరుతోంది. ఫిష్ వెంకట్?కు భార్య, ఒక కూతురు ఉన్నారు. హాస్పిటల్ బిల్లులు పెరిగిపోతుండటంతో ఆయన కుటుంబం ఆందోళనలో ఉంది. ఫిష్ వెంకట్?కు ఈ పరిస్థితుల్లో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అండగా నిలుస్తుందని ఆ కుటుంబం ఆశగా ఎదురుచూస్తోంది.

# ట్రంప్ ఎఫెక్ట్: అమెరికాలోకి భారీగా తగ్గిన భారత అక్రమ వలసలు

- అమెరికాలోకి భారతీయుల అక్రమ వలసలు 70 శాతం తగ్గుదల
- ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో 10,382 మంది అరెస్ట్
- ట్రంప్ హయాంలో కఠినంగా మారిన సరిహద్దు భద్రత
- అమెరికాలో అధికారిక పత్రాలు లేకుండా 2.2 లక్షల మంది భారతీయులు



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలో అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించే భారతీయుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి అక్రమ వలసలు దాదాపు 70 శాతం తగ్గినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ హయాంలో సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేయడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే, ఈ ప్రమాదకర ప్రయాణాల్లో విషాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) విడుదల చేసిన డేటా ప్రకారం, ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్య కాలంలో అమెరికా సరిహద్దుల్లో 10,382 మంది భారతీయులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తల్లిదండ్రుల తోడు లేని 30 మంది మైనర్లు కూడా ఉన్నారు. గత ఏడాది ఇదే సమయంలో పట్టుబడిన భారతీయుల సంఖ్య 34,535గా ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్య భారీగా తగ్గింది. ఒకప్పుడు జో బైడెన్ హయాంలో రోజుకు సగటున 230 మంది భారతీయులు పట్టుబడితే, ప్రస్తుతం ఆ సంఖ్య 69కి పడిపోయింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మార్పులు ఖాయమని తేలడంతో మానవ అక్రమ రవాణా ముఠాలు కూడా తమ కార్యకలాపాలను తగ్గించినట్లు ఒక ఆంగ్ల పత్రిక కథనం వెల్లడించింది. ఈ అక్రమ వలసల ప్రయాణం ప్రాణాలకే ముప్పుగా మారుతోంది. మే 9న కాలిఫోర్నియాలోని డెల్ మార్ తీరంలో జరిగిన పడవ ప్రమాదంలో 14 ఏళ్ల బాలుడు, 10 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ భారత్ కు చెందిన అన్నాచెల్లెళ్లుగా గుర్తించారు. మెక్సికో తీరం నుంచి చిన్న పడవల ద్వారా అమెరికా జలాల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగింది. అమెరికా పౌరసత్వం వస్తుం దన్న ఆశతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ఒంటరిగా సరిహద్దులు దాటిస్తున్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో ఇలా తల్లిదండ్రుల నుంచి వేరైన 500 మంది మైనర్లను అధికారులు రక్షించారు. వీరిలో ఎక్కువగా 12 నుంచి 17 ఏళ్ల వయసు వారే ఉంటున్నారు. ట్రంప్ ప్రభుత్వం ఇలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఏప్రిల్ 2024 నాటి లెక్కల ప్రకారం, అమెరికాలో ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండా సుమారు 2.2 లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 332 మందిని అధికారులు గుర్తించి తిరిగి భారత్‌కు పంపించారు. అక్రమ రవాణాదారుల మాటలు నమ్మి ఎందరో భారతీయులు కఠినమైన, ప్రమాదకర మార్గాల్లో ప్రయాణించి అమెరికా చేరుకోవాలని ప్రయత్నించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

## గ్యాప్ లేకుండా కురుస్తున్న వర్షం...నగరవాసుల ఇబ్బందులు



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో భారీ వర్షం పడుతుంది. గత రెండు రోజుల నుంచి భారీ వర్షం పడుతుంది. నిన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేని వాన కురుస్తుండటంతో నగరవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసులకు, విద్యాసంస్థలకు వెళ్లే పిల్లలు వర్షం దెబ్బకు ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండటంతో ఏ పని చేయడానికి వీలులేకుండా పోయింది. చల్లటి వాతావరణంతో పాటు ఉదయం నుంచి మేఘాలు కమ్ముకున్నాయి. భారీ వర్షం పడుతుండటంతో అనేక రహదారులపై నీరు ప్రవహిస్తుంది. వర్షం పడుతుండటంతో అనేక ప్రాంతాలు హైదరాబాద్ లో తడిసి ముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

**బయటకు వచ్చేందుకు...**

ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దిల్ సుఖ్ నగర్, సరూర్ నగర్, అమీర్ పేట్, మాదాపూర్, కొండాపూర్, కూకట్ పల్లి, గచ్చిబౌలి, ఉప్పల్, రామాంతపూర్, అమీర్ పేట్, లక్డీకాపూల్, మెహిదీపట్నం, చందానగర్, మలక్ పేట్, ఎల్బీనగర్, సరూర్ నగర్, హయత్ నగర్ ప్రాంతంలో భారీ వర్షం కురుస్తుంది. దీంతో లోతట్టు ప్రాంతాల్నీ జలమయమయ్యాయి. ఇక ఆఫీసుకు వెళ్లేందుకు వాహనాలు రోడ్డు పైకి చేరుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లలోకి నీరు చేరడంతో రాత్రంతా జాగారం చేయాల్సివచ్చిందని స్థానికులు చెబుతున్నారు. గ్యాప్ లేకుండా వర్షం కురుస్తుండటంతో ఎక్కడికి వెళ్లి తలదాచుకుందామనుకున్నా వీలుకాలేదంటున్నారు

**రహదారులపై నీరు...**

రహదారులపైకి నీరు చేరడంతో వాహనాలు మొరాయిస్తున్నాయి. హైదరాబాద్ లో కుండపోత వర్షం కురియడంతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆగకుండా వర్షం కురవడంతో అనేక చోట్ల నగరంలో విద్యుత్తు సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినట్లుగానే వర్షం పడుతుండటంతో ముఖ్యంగా పాఠశాలలు, ఆఫీసులకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. చిరు వ్యాపారులు సయితం రోడ్లపైన విక్రయించేందుకు వచ్చి వర్షం పడటంతో అవస్థలు పడుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాపారాలు మందగించాయి. కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయని అంటున్నారు. మొత్తం హైదరాబాద్ లో భారీ వర్షంతో జనజీవనం అతలాకుతలంగా మారింది.

## గుజరాత్ హైకోర్టు వర్చువల్ విచారణ... తీరిగ్గా బీరు తాగుతూ కనిపించిన న్యాయవాది!



**హైదరాబాద్ పెన్ పవర్:**కోర్టు విచారణ జరుగుతుండగా ఒక సీనియర్ న్యాయవాది ప్రవర్తించిన తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. వర్చువల్ విచారణలో పాల్గొంటూ బీర్ తాగుతూ, ఫోన్‌లో మాట్లాడుతూ కనిపించిన న్యాయవాదిపై గుజరాత్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయనపై సుమోటోగా (స్వయంగా) కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని ఆదేశించింది. ఈ ఘటన న్యాయవ్యవస్థ గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది.

గుజరాత్ హైకోర్టులో సీనియర్ కౌన్సిల్‌గా ఉన్న భాస్కర్ తన్నా, జూన్ 25న జస్టిస్ సందీప్ భట్ ధర్మాసనం ముందు జరుగుతున్న ఒక వర్చువల్ విచారణకు హాజరయ్యారు. ఆ సమయంలో ఆయన బీర్ మగ్గుతో ఏదో పానీయం తాగుతూ, మరోవైపు తన ఫోన్‌లో మాట్లాడుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ వీడియో క్లిప్ కొద్ది రోజుల్లోనే సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. ఈ వీడియోను గమనించిన జస్టిస్ ఏఎస్ సుపేహియా, జస్టిస్ ఆర్‌టీ వచానిలతో కూడిన ధర్మాసనం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. న్యాయవాది తన్నా ప్రవర్తన అత్యంత దారుణంగా, ఘోరంగా ఉందని మండిపడింది. "న్యాయవాది ప్రవర్తన తీవ్ర అభ్యంతరకరంగా ఉంది. ఇలాంటి చర్యలను ఉపేక్షిస్తే చట్టబద్ధమైన పాలనకు పెను విఘాతం కలుగుతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వెంటనే స్పందించిన కోర్టు, న్యాయవాది భాస్కర్ తన్నాపై సుమోటోగా కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని రిజిస్ట్రీకి నాడు ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించిన నివేదికను తదుపరి విచారణ నాటికి సమర్పించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా, ప్రస్తుతం కొనసాగుతున్న కేసులో తదుపరి విచారణలకు వర్చువల్ పద్ధతిలో హాజరు కాకుండా తన్నాపై తాత్కాలిక నిషేధం విధించింది. ఈ కోర్టు ధిక్కరణ కేసు విచారణను రెండు వారాల తర్వాత చేపట్టనున్నట్లు ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.